epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : ఆదివారం-సెప్టెంబర్ 10-2023 పేజీలు : 2

## అరుదైన దృశ్యం

**మీడియా, సెప్టెంబర్ 9,న్యూఢిల్లీ:**



దేశ రాజధాని వేదికగా- ప్రపంచ దేశాల్లో అత్యున్నత భేటీల్లో ఒకటిగా భావించే జీ20 శిఖరాగ్ర సదస్సు కొనసాగుతోంది..సదస్సులో వేదిక వద్ద అరుదైన దృశ్యం కనిపించింది. స్వాగతోపన్యాసం ప్రారంభం కావడానికి ముందు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వేదిక వద్దకు వచ్చారు. అప్పటికే వేదిక వద్ద తనకు కేటాయించిన స్థానంలో కూర్చుని ఉన్న బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా.. బైడెన్‌ను చూసి, లేచి వెళ్లి ఆయనను చిరునవ్వుతో పలకరించారు. బైడెన్ కూడా అంతే ఆప్యాయంగా హసీనాతో మాట్లాడారు. షేక్ హ్యాండ్ ఇచ్చారు. అనంతరం ఆమెతో సెల్ఫీ దిగారు. తన మొబైల్ ఫోన్‌తో షేక్ హసీనాతో కలిసి ఫొటో దిగారు. కొద్దిసేపు నిల్చునే వారిద్దరూ మాట్లాడుకున్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన...

# జీ-20 సమావేశం

**ప్రపంచంలోని అతిపెద్ద ఫోరమ్‌లలో ఒకటైన జీ20 సమ్మిట్‌లో ప్రపంచంలోని అనేక అగ్రరాజ్యాల అధినేతలు ప్రస్తుతం భారతదేశంలో ఉన్నారు. ఈరోజు బ్రిటన్, జపాన్, జర్మనీ, ఇటలీలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. కాగా, ఈరోజే జీ20 మొదటి సమావేశం జరుగుతోంది. దీనికి సంబంధించిన లైవ్ అప్డేట్స్ మీకోసం..**



## భద్రతావలయంలో ఢిల్లీ

- కలిస్తే సవాళ్లను ఎదుర్కోవచ్చు : బ్రిటన్ ప్రధాని
- ప్రపంచ ఐక్యతకు చిహ్నం : ప్రధాని మోదీ

**టి మీడియా, సెప్టెంబర్ 9,ఢిల్లీ :**

**మనం కలిస్తే సవాళ్లను ఎదుర్కోవచ్చు: బ్రిటన్ ప్రధాని**

ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రపంచ వృద్ధిని పునరుద్ధరించడానికి 15 సంవత్సరాల క్రితం జీ 20 నాయకులు మొదటిసారి కలిసి వచ్చారని బ్రిటిష్ ప్రధాన మంత్రి రిషి సునక్ ట్వీట్ చేశారు. "ప్రపంచం అపారమైన సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో మేము కలుస్తాము, నాయకత్వాన్ని అందించడానికి ప్రపంచం మరోసారి జీ 20 వైపు చూస్తుంది. మనం కలిసి ఈ సవాళ్లను ఎదుర్కోగలమని నేను నమ్ముతున్నాను" అని అన్నారు.

**ప్రధాని మోదీ, మహమ్మద్ బిన్ సల్మాన్ మధ్య ద్వైపాక్షిక చర్చలు**

సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ మూడు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ చేరుకున్నారు. ఆయన ప్రధాని నరేంద్ర మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అలాగే వ్యూహాత్మక భాగస్వామ్య మండలి మొదటి నాయకత్వ స్థాయి సమావేశానికి సహ-అధ్యక్షుడుగా కూడా వ్యవహరించనున్నారు.

**భారతదేశ నాయకత్వం ప్రపంచ ఐక్యతకు చిహ్నం : ప్రధాని మోదీ**

జీ20 సమ్మిట్ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగంలో, "జీ 20కి భారతదేశం అధ్యక్షత వహించడం దేశం లోపల, వెలుపల అందరినీ కలుపుకుపోవడానికి, ఐక్యతకు చిహ్నంగా మారింది. ఇది ప్రజల కోసం మారింది. కోట్లాది మంది భారతీయులు జీ20తో అనుబంధం కలిగి ఉన్నారు. దేశంలో 60కి పైగా నగరాల్లో 200కు పైగా సమావేశాలు జరిగాయి. సబ్కా సాథ్ స్ఫూర్తితో ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని భారత్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు మనమందరం అంగీకరిస్తామని నేను నమ్ముతున్నాను" అని అన్నారు.

**భద్రతావలయంలో ఢిల్లీ**

జీ20 సమావేశాల సందర్భంగా శనివారం, ఆదివారం సెంట్రల్ ఢిల్లీలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రగతి మైదాన్, కర్తవ్యపథ్, ఇండియాగేట్ ప్రాంతాల్లో ప్రజల రాకపోకలపై నిషేధం విధించారు. సెంట్రల్ సిటీలో బస్సులు, ట్యాక్సీ సర్వీసులపైనా కూడా ఆంక్షలు విధించారు. సెంట్రల్ ఢిల్లీలో నివసించేవారికి మినహా మరెవరినీ లోపలికి బయటికి అనుమతించకుండా చర్యలు తీసుకుంటున్నారు. సుప్రీంకోర్టు, పటేల్ చౌక్, ఆర్కే ఆశ్రమ్ మార్గ్ మెట్రో స్టేషన్లలో 4 రోజుల పాటు పార్కింగ్ నిషేధించారు. ఉద్యోగులు వ్యక్తిగత వాహనాలు వదిలి మెట్రో రైళ్లనే ఉపయోగించాలని ఆదేశాలు జారీ చేశారు.

సెంట్రల్ ఢిల్లీలో విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, మార్కెట్లు, మద్యం దుకాణాలు, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలపై ఆంక్షలు విధించడంతో అవన్నీ మూతపడ్డాయి. జీ 20 భద్రతా విధుల్లో 1.3 లక్షల మంది పోలీస్, పారామిలటరీ సిబ్బంది ఉన్నారు. నగరంలో అడుగడుగునా సీసీటీవీ కెమేరాలు ఏర్పాటు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా వినియోగిస్తున్నారు. ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా అనుమానితులను పసిగట్టేలా ఏర్పాట్లు చేశారు. ఇక ఈ సమావేశాల నేపథ్యంలో ఢిల్లీ విమానాశ్రయం నుంచి 160కి పైగా దేశీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. దేశాధినేతల విమానాలు మినహా చార్టర్డ్ విమానాల రాకపోకలు పూర్తిగా నిలిపేశారు. ఇక 207 రైళ్లను రద్దు చేయగా, మరో 36 రైళ్లను దారిమళ్లించారు.

**అందరూ కలిసిమెలిసి ఉండాల్సిన**

### సమయం ఇదే : ప్రధాని మోదీ

ఢిల్లీలో జరిగిన సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ, కోవిడ్-19 తర్వాత, విశ్వాసం లేకపోవడం వల్ల ప్రపంచంలో పెద్ద సంక్షోభం వచ్చిందని అన్నారు. యుద్ధం విశ్వాస లోటును మరింతగా పెంచిందని.. మనం కోవిడ్‌ను ఓడించగలిగినప్పుడు, పరస్పర అపనమ్మకం రూపంలో వచ్చిన సంక్షోభాన్ని కూడా మనం ఓడించగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. మనం కలిసి ప్రపంచ విశ్వాస లోటును విశ్వసనీయంగా మారుద్దామని అన్నారు. అందరూ కలిసికట్టుగా కదలాల్సిన సమయం ఇదని.. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా ప్రయాస్ అనే మంత్రం మనందరికీ మార్గదర్శకం కాగలదని పేర్కొన్నారు. భారతదేశం యొక్క జీ 20 ప్రెసిడెన్సీ దేశం లోపల మరియు వెలుపల చేరిక యొక్క సబ్కా సాథ్ యొక్క చిహ్నంగా మారిందని మోదీ అన్నారు.

**ఇక నుంచి జీ20ని జీ21గా పిలవాలి**

ఇక నుంచి జీ20ని జీ21గా పిలుస్తున్నారు. కారణం, ఈ కూటమిలో ఆఫ్రికన్ యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందింది. భారతదేశం గ్లోబల్ సౌత్ నాయకత్వంలో స్థిరపడింది. ఆఫ్రికన్ యూనియన్‌లో 55 దేశాలు ఉన్నాయి. "ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని మేము ప్రతిపాదించాము. మీరందరూ దీనితో ఏకీభవిస్తారని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. మీ అందరి సమ్మతితో తదుపరి చర్యను ప్రారంభించడానికి ముందు, నేను ఆఫ్రికన్ యూనియన్‌ను సభ్యునిగా ఆహ్వానిస్తున్నాను" ప్రధాని మోదీ అన్నారు.

## ఈడీ విచారణకు ఝార్ఖండ్ సీఎం సోరెన్ డుమ్మా



**టి మీడియా, సెప్టెంబర్ 9,ఢిల్లీ:**

భారత్ నిర్వహిస్తోన్న జీ20 సదస్సు వేళ.. శనివారం రాత్రి అతిథులకు రాష్ట్రపతి విందు ఇస్తున్నారు. దీనికి రాష్ట్రాల ముఖ్య మంత్రులకు కూడా ఆహ్వానం అందింది. వారిలో పలువురు సీఎంలు ఇప్పటికే ఢిల్లీ బయలుదేరారు. ఝార్కండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కూడా విందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. దాంతో ఆయన శనివారం హాజరుకావాల్సిన ఈడీ విచారణకు డుమ్మా కొట్టనున్నట్లు కనిపిస్తోంది.మనీలాండరింగ్ కేసులో సోరెన్ ఈడీ ముందు హాజరు కావాల్సి ఉంది. అయితే ఆగస్టు 14, ఆగస్టు 24 తేదీల్లో ఆయను గైర్హాజరయ్యారు. దాంతో సెప్టెంబర్ 9న రాంచిలోని తమ ప్రాంతీయ కార్యాలయంలో హాజరుకావాలని ఈడీ నోటీసుల్లో పేర్కొంది. అయితే జీ20 సదస్సు నేపథ్యంలో ఈ రోజు రాత్రి రాష్ట్రపతి విందు ఇస్తున్నారు. ఆ నిమిత్తం సోరెన్ దిల్లీ వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యా లయం వెల్లడించింది. దాంతో ఇప్పుడు ఆయన ఈ విచారణకు హాజరు కావడం తెలుస్తోంది. ఇదివరకు అక్రమ మైనింగ్ వ్యవహారంతో సంబంధం ఉందన్న ఆరోపణలపై సోరెన్‌ను ఈడీ విచారించిన విషయం తెలిసిందే.

## ఆధార్ అప్‌డేట్ గడువు పొడిగింపు

**టి మీడియా, సెప్టెంబర్ 9,న్యూఢిల్లీ**

యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) ఆధార్‌ను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు గడువును మరో మూడు నెలలు పాటు పొడిగించింది. ప్రస్తుతం గడువు సెప్టెంబరు 14తో ముగియనున్న నేపథ్యంలో డిసెంబరు 14 వరకు ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆధార్ యూజర్ల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు డిసెంబరు 14 వరకు పొడిగించాలని నిర్ణయిం చినట్లు పేర్కొంది. సాధ్యమైనంత వరకు ఎక్కువ మంది ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకునేలా ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. మై ఆధార్ పోర్టల్ ద్వారా ఉచితంగా ఆధార్ డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పింది. అలాగే ఆధార్ జారీ పదేళ్లు దాటిన వారి వివరాలను మళ్లీ అప్‌డేట్ ప్రక్రియను యుఐడిఎఐ ప్రారంభించింది. అడ్రస్, వ్యక్తిగత వివరాలు మార్చుకోవాలనునేవారు అందుకు సంబంధించిన ఐడి ప్రూఫ్, అడ్రస్ ప్రూఫ్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. సాధారణంగా ఈ వివరాలను అప్డేట్ చేసుకోవాలంటే ఆధార్ కేంద్రాలకు వెళ్లి రూ.50 వరకు చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబరు 14 వరకు డబ్బులు చెల్లించాల్సిన పని లేదు. myaadhaar.uidai.gov.in వెబ్‌సైట్‌లోనూ ఉచితంగానే ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవచ్చులు అప్‌డేట్ చేసుకోవచ్చు.



## నేడు చంద్రబాబు, భువనేశ్వరిల

# 42వ పెళ్లి రోజు

- ముందు రోజు అరెస్ట్

**టీ మీడియా ,సెప్టెంబర్ 9, హైదరాబాద్:**

చంద్రబాబుని అరెస్ట్ చేసిన తరువాత ఆయన భార్య భువనేశ్వరి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. తన భర్త చంద్రబాబుకు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకున్నారు. ఎవరికైనా మనస్సుకు బాధ కలిగితే కష్టాలు వస్తే తల్లికి చెప్పుకుంటారు..అందుకు తన కష్టాన్ని దుర్గమ్మ తల్లికి చెప్పుకుందామని వచ్చానని అరెస్ట్ అయిన తన భర్తకు మనోధైర్యాన్ని కలిగించాలని అమ్మను కోరానని ఆవేదనతో వెల్లడించారు. ఇదిలా ఉంటే నారా చంద్రబాబు భువనేశ్వరిలో పెళ్లి రోజు రేపే..అంటే సెప్టెంబర్ 10న నారా చంద్రబాబు భువనేశ్వరిల పెళ్లి రోజు. తెలుగు తెరపై చెరగని ముద్ర వేసిన నటుడు, విశ్వవిఖ్యాత నందమూరి తారకరామారావు కుమార్తె భువనేశ్వరిని..నారా చంద్రబాబు నాయుడికిచ్చి వివాహం జరిపించారు. 1981,సెప్టెంబర్ 10న వీరి వివాహం జరిగింది. ఉదయం 8 గంటల 6 నిమిషాలకు చెన్నైలోని మౌంట్ రోడ్డులోని గవర్నమెంట్ లో ఎస్టేట్ కలైవాసర ఆరంగంలో వీరి వివాహ వేడుక జరిగింది.అప్పటికే చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ, పరిశ్రమలు, పురావస్తు శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పెళ్లిరోజుకి ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. మంత్రిగా ఉన్నారు. చంద్రబాబు చురుకుదనం, విజన్ నచ్చిన ఎన్టీఆర్.. తన కుమార్తెనిచ్చి వివాహం చేశారు. వారి వివాహం జరిగిన రెండేళ్లకు లోకేశ్ జన్మించారు. లోకేశ్ కు చంద్రబాబు తన బావమరిది..ప్రముఖ సినీ నటుడు బాలకష్ణ పెద్ద కుమార్తె బ్రాహ్మణితో వివాహం జరిపించారు. వారికి ఓ బాబు. పేరు దేవాన్ష్.ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన చంద్రబాబు విద్యార్థి సంఘం నాయకుడి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. ఆయనలోని విజనరీని గుర్తించిన రామారావు తన కుమార్తెనిచ్చి వివాహం జరిపించారు. అలారాజకీయాల్లోకి వచ్చిన చంద్రబాబు ఎమ్మెల్యేగా..మంత్రిగా..ముఖ్యమంత్రిగా..ప్రతిపక్ష నేతగా ఎన్నో రకాల రాజకీయ జీవితాన్ని చవిచూశారు. విజన్ ఉన్న నాయకుడిగా పేరొందారు.సెప్టెంబర్ 10(2023)కు చంద్రబాబు,భువనేశ్వరిల వివాహం జరిగి 42ఏళ్లు పూర్తికానున్నాయి. 1981లో వివాహంతో ఒక్కటైనా ఈ జంట ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉన్నా ఓ పక్క హెరిటేజ్ డైరీని కూడా నిర్వహిస్తు మరోపక్క కుటుంబాన్ని కూడా చక్కగా సమర్థవంతంగా నిర్వహించేవారు భువనేశ్వరి.ఈక్రమంలో చంద్రబాబు రేపు 42వ వివాహ దినోత్సం అనగా ఈరోజే (సెప్టెంబర్ 9,2023) అరెస్ట్ అయ్యారు. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేశారు ఏపీ సీఐడీ పోలీసులు. స్కిల్ డెవలప్ మెంట్ లో రూ.550 కోట్ల కుంభకోణం జరిగిందని..ఈ స్కామ్ లో చంద్రబాబు ప్రధాన సూత్రధారిగా ఉన్నారనే ఆరోపణలో చంద్రబాబును అరెస్ట్ చేశారు. రేపు పెళ్లి రోజు అనగా ఈరోజు చంద్రబాబు అరెస్ట్ కావటం గమనించాల్సిన విషయం.

## వాట్సాప్ చాటింగ్‌పై చంద్రబాబు మౌనం

- రాత్రంతా విచారణ
- సిట్ కార్యాలయంలో లోకేశ్, భువనేశ్వరి..

**టి మీడియా, సెప్టెంబర్ 9,విజయవాడ :**



తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును సీఐడీ పోలీసులు ఉదయం నంద్యాలలో అరెస్టు చేశారు. ప్రత్యేక కాన్వాయ్ ద్వారా రోడ్డు మార్గంలో అమరావతికి చంద్రబాబును తీసుకొస్తున్నారు. విచారణ అనంతరం చంద్రబాబును జీజీహెచ్ కు సీఐడీ అధికారులు తరలించనున్నారు. వైద్య పరీక్షల తరువాత ఏసీబీ కోర్టులో చంద్రబాబును హాజరుపర్చనున్నారు.చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమని తెలంగాణ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆయన పట్ల రాజకీయ కక్షతో దుర్మార్గంగా వ్యవహరించారని తుమ్మల మండిపడ్డారు.

**బాలకృష్ణను అనుమతించని అధికారులు..**

హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బాలకృష్ణ, నారా బ్రాహ్మణి గన్నవరం చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సిట్ కార్యాలయానికి వెళ్లారు. అయితే, సిట్ కార్యాలయంలో చంద్రబాబును కలిసేందుకు బాలకృష్ణ, బ్రాహ్మణిలను అధికారులు అనుమతించలేదు.

**సిట్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత**

సిట్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కార్యాలయం వద్దకు భారీగా టీడీపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారిని పోలీసులు పంపించి వేస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరగడంతో పలువురు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.చంద్రబాబు నాయుడు సిట్ అధికారుల విచారణకుసహకరించడం లేదని సీఐడీ అధికారులు పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. వాట్సాప్ చాటింగ్ పై చంద్రబాబు మౌనంగా ఉండిపోయారని సమాచారం.

# ధిక్కార స్వరం కాళోజి

- ముఖ్యమంత్రి కేసీఆర్

**టీ మీడియా ,సెప్టెంబర్ 9, హైదరాబాద్:**



సామాజిక సమస్యలను అన్యాయాలను తట్టుకోలేక ప్రజలకోసం 'తన గొడవ'ను కవిత్వం ద్వారా సున్నితంగా ఆవిష్కరించిన కాళోజీ స్ఫూర్తి, తెలంగాణ సాధనలో, ప్రగతిలో ఇమిడి ఉన్నదన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్. తెలంగాణ భాషా సాహిత్య రంగాల్లో కృషిచేస్తున్న కవులు రచయితలను గుర్తించి వారికి కాళోజీ పేరిట ప్రతి యేటా పురస్కారాలను అందిస్తూ ప్రభుత్వం గౌరవించుకుంటున్నది అని చెప్పారు. ఈ సంవత్సరానికి గాను కాళోజీ పురస్కారాన్ని అందుకుంటున్న, ప్రముఖ కవి జయరాజుకు సీఎం మరోసారి అభినందనలు తెలిపారు.పద్మ విభూషణ్ ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరిట తెలంగాణ ప్రభుత్వం ప్రతియేటా ప్రకటించే "కాళోజీ నారాయణరావు అవార్డు" 2023 సంవత్సరానికి గాను ప్రముఖ కవి, పాటల రచయిత, గాయకుడు జయరాజ్ కు ప్రకటించింది. సాహిత్య, సాంస్కతిక రంగాల్లో కవి, గాయకుడు జయరాజ్ చేసిన కృషిని గుర్తిస్తూ కాళోజీ అవార్డును ప్రకటించారు.రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫారసుల మేరకు సీఎం కేసీఆర్ కవి జయరాజ్ ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. సెప్టెంబర్ 9న కాళోజీ నారాయణ రావు జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో కవి జయరాజ్‌కు కాళోజీ అవార్డును అందజేయనున్నారు. ఈ అవార్డు ద్వారా రూ. 1,01,116 నగదు రివార్డు, జ్ఞాపికను అందించి సత్కరించనున్నారు.మహబూబాబాద్ జిల్లాకు చెందిన జయరాజ్ (60) చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలను అధిగమించి కవిగా పేరు తెచ్చుకున్నారు. పేద దళిత కుటుంబానికి చెందిన జయరాజ్ వివక్షత లేని సమసమాజం కోసం ఎన్నో సాహిత్య రచనలు చేశారు. బుద్ధుని బోధనలకు ప్రభావితమై అంబేడ్కర్ రచనలతో స్ఫూర్తి పొందిన జయరాజ్, తెలంగాణ ఉద్యమ కాలంలో పల్లెల్లో తిరుగుతూ.. తన ఆట, పాట, గానంతో ప్రజల్లో తెలంగాణ సాంస్కృతిక ఉద్యమ భావజాలాన్ని రగిలించారు.ప్రకతి గొప్పతనాన్ని వర్ణిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం జయరాజ్ పాటలు రచించారు. మనిషికి ప్రకృతికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని తన సాహిత్యం ద్వారా సున్నితంగా విశ్లేషించారు. కవి జయరాజ్ రచించిన పలు పుస్తకాలు ప్రజాదరణ పొందాయి.

## మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు

- నాహక్కులు ఎందుకు ఉల్లంఘిస్తున్నారు
- ఎఫ్ఐఆర్ ఇస్తాము: పోలీసులు

**టి మీడియా, సెప్టెంబర్ 9,నంద్యాల:**

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబును పోలీసులు అరెస్టు చేశారు. తొలుత నంద్యాలలోని ఆర్.కె.ఫంక్షన్ హాల్ వద్ద ఆయన బస చేసిన బస్సు వద్దకు పోలీసులు చేరుకున్నారు. ఆయనతో మాట్లాడి అదుపులోకి తీసుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి చంద్రబాబును అరెస్టు చేసినట్లు సీఐడీ పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం.. ఆయన కాన్వారులోనే ఎన్ఎస్‌జీ భద్రతతో విజయవాడ తరలిస్తున్నట్లు తెలిపారు. అరెస్టుకు సంబంధించిన పత్రాలపై చంద్రబాబు సంతకం చేశారు. విజయవాడలోని ఏసీబీ కోర్టులో చంద్రబాబును హాజరుపరిచే అవకాశం ఉంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. నాహక్కులు ఎందుకు ఉల్లంఘిస్తున్నారని ప్రశ్నించారు. నేను తప్పు చేస్తే నడిరోడ్డులో ఉరేయండి అని చంద్రబాబు అన్నారు. ఏ చట్ట ప్రకారం నన్ను అరెస్టు చేస్తారు చంద్రబాబు ప్రశ్నించారు. ప్రాథమిక ఆధారాలు లేకుండా ఎలా అదుపులోకి తీసుకుంటారన్నారు. అయితే హైకోర్టుకు ప్రాథమిక ఆధారాలు ఇచ్చామని పోలీసులు తెలిపారు. మరోవైపు చంద్రబాబు తరఫున న్యాయవాదులు పోలీసులతో వాదిస్తున్నారు. ఆధారాలు చూపించాలని అడిగారు. రిమాండ్ రిపోర్టులో అన్నీ ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఎఫ్ఐఆర్ ఇస్తామన్నారు. అయితే ప్రాథమిక ఆధారాలు చూపించాల్సిందేనని న్యాయవాదులు పట్టుబట్టారు. సూపర్‌వైజర్ ఆఫీసర్ రావాల్సిన అధికారం ఏముందని చంద్రబాబు పోలీసులను ప్రశ్నించారు. మరోవైపు మీడియాను పోలీసులు దూరంగా పంపించివేశారు. పోలీసులతో న్యాయవాదులు చర్చిస్తున్నారు. అరెస్టు పత్రాలను వారు పరిశీలించారు. అయితే కొన్ని గంటల్లో అన్ని పత్రాలు ఇస్తామని పోలీసులు తెలిపారు. ఎఫ్ఐఆర్ లో చంద్రబాబు పేరు లేదని న్యాయవాదులు ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్ పేరు లేకుండా ఎలా అరెస్టు చేస్తారని ఈ సందర్భంగా తెదేపా అధినేత పోలీసులను ప్రశ్నించారు. తనని అరెస్టు చేసే ముందు ఆ పత్రాలను ఇవ్వాలని అన్నారు. అయితే



అరెస్టు చేశాక తగిన పత్రాలు ఇస్తామని పోలీసులు పేర్కొంటున్నారు. దేని గురించి అరెస్టు చేస్తారనే అడిగే హక్కు సామాన్యులకు కూడా ఉందని చంద్రబాబు అన్నారు. అరెస్టు నోటీసులు ఇచ్చామని పోలీసులు చెబుతున్నారు. డీకే బసు కేసు ప్రకారం వ్యవహరించామని పోలీసులు చెబుతున్నారు. 24 గంటల్లో అరెస్టుకు కారణాలతో కూడిన పత్రాలు ఇస్తామని పోలీసులు చెబుతున్నారు. అంతకు ముందు చంద్రబాబు బస చేసిన ఆర్.కె.ఫంక్షన్ హాల్ వద్ద తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నంద్యాల జిల్లా పర్యటనలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు చేస్తారని పుకార్లు రావడంతో నంద్యాల, కర్నూలు జిల్లాల ముఖ్యనాయకులు చంద్రబాబు బసచేసిన నంద్యాల ఆర్‌కె ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. ఇటీవల ఆయనకు ఐటి నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో తనను అరెస్టు చేసే అవకాశం ఉందని చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. శుక్రవారం నంద్యాల పర్యటనలో ఉన్న చంద్రబాబు బహిరంగసభ అనంతరం ఆరెకె ఫంక్షన్‌హాలులో బసచేసారు.

## జీ 20 దేశాల అధినేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విందు

**టీ మీడియా, సెప్టెంబర్ 9,ఢిల్లీ :**



లో జీ20 సదస్సు జరుగుతున్న నేపథ్యంలో ఆయా దేశాల నేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విందు ఇచ్చారు. ఆమెను పలు దేశాల అధినేతలు కలిశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ కూడా పాల్గొన్నారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన విందులో నోరూరించే రుచులు ఎన్నో ఉన్నాయి. అన్ని రకాల వంటకాలను.. ప్రత్యేకంగా తయారు చేసిన వెండి పాత్రల్లో అతిథులు భుజించారు. మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, హెచ్‌డీ దేవేగౌడకు ఆహ్వానం అందినప్పటికీ ఈ విందుకు హాజరుకాలేదు.అంతకుముందు జీ20 సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీన సెల్ఫీ తీసుకున్నారు. యూకే ప్రధాన మంత్రి రిషి సునక్ ఆదివారం ఢిల్లీలోని అక్షరధామం మందిరాన్ని దర్శించుకోనున్నారు. ఈ విషయంపై ఆయన ఇప్పటికే ప్రకటన చేశారు. యూకే, జపాన్ ప్రధానులతో భారత ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. మొదట యూకే ప్రధాని రిషి సునక్ తో సమావేశాలు నిర్వహించి, ఇరు దేశాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

# చంద్రబాబు కోసం ఏసీబీ కోర్టులో వాదనలు వినిపించనున్న సిద్ధార్థ లూథ్రా

టి మీడియా, సెప్టెంబర్ 9,విజయవాడ :

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుని ఏపీ సిఐడి అధికారులు స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో ఆరోపణలపై అరెస్టు చేయడంపై ఏపీలో హై టెన్షన్ నెలకొంది. చంద్రబాబు నాయుడు అరెస్టుపై తెలుగుదేశం పార్టీ భగ్గుమంది. ఎటువంటి ఆధారాలు లేకుండా స్కిల్ డెవలప్మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి అరెస్టు చేయడం వైసిపి నిరంకుశ పాలనకు నిదర్శనమని పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ కక్షలో భాగంగానే చంద్రబాబును అరెస్టు చేశారని టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. చంద్రబాబును ఏదో ఒక కేసులో ఇరికించి జైలుకు పంపాలి అనేది జగన్ లక్ష్యమని, అందుకే చంద్రబాబును అరెస్ట్ చేశారని టిడిపి నేతలు విమర్శిస్తున్నారు.ఏపీలో మాత్రమే కాదు ఇటు తెలంగాణాలోనూ చంద్రబాబు అరెస్ట్ కు నిరసనగా ఆందోళనలు



కొనసాగుతున్నాయి. పోలీసులు అరెస్టులు, హౌస్ అరెస్టులతో టీడీపీ నేతలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉంటే టిడిపి అధినేత చంద్రబాబును మరి కాసేపట్లో ఏసీబీ కోర్టులో హాజరు పరిచనున్నారు. ఏసీబీ కోర్టులో టిడిపి అధినేత చంద్రబాబు రిమాండ్ పిటిషన్ పై వాదనలు జరగనున్నాయి. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించనున్నారు. ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో విజయవాడకు వచ్చి చంద్రబాబు కోసం వాదించనున్నారు. సిద్ధార్థ లూథ్రా ప్రస్తుతం ఆయన తన టీంతో కలిసి ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నట్లు సమాచారం. విజయవాడ ఎసిబి కోర్టులో ఆయన చంద్రబాబు తరఫున వాదనలు వినిపించనున్నారు. మరోవైపు చంద్రబాబు అరెస్ట్, ఏసీబీ కోర్టుకు తరలింపు నేపథ్యంలో చోటు చేసుకుంటున్న ఉద్రిక్తతల కారణంగా ఏసిబి కోర్టు వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. గతంలో ఎమ్మెల్సీని ఓటుకు నోటు కేసులో ప్రలోభాపెట్టేందుకు ప్రయత్నించారని చంద్రబాబుపై నమోదైన కేసులో చంద్రబాబు నాయుడు తరపున వాదించిన న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఇప్పుడు కూడా స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు తరపున తన వాదనలు వినిపించనున్నారు.

# స్వాతి హాస్పిటల్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే

టి మీడియా, సెప్టెంబర్ 9, హుజూర్ నగర్:



ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి శనివారం హుజుర్నగర్ లోని స్వాతి హాస్పిటల్ ఆర్థో, యాక్సిడెంట్ కేర్ యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఒక ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పుడు ఆ ప్రాంతానికి రకరకాల ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రయివేటు సెక్టార్ కూడా విస్తరిస్తుందని..నేడు అటువంటి అద్భుత స్థాయిలో హుజుర్నగర్ ఉందని, ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సదుపాయాలు ఉండటం చాలా మంచిదని,,ప్రాణాలు కాపాడే అతి విలువైన సమయంలోనే ఆసుపత్రులు ఉంటే ప్రాణాలు కాపాడుకోగలుగుతామని తెలియజేసారు, అదేవిదంగా ఆసుపత్రి యాజమాన్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ,రోగులని బాధితులని ప్రేమతో, ఓపికతో చూడాలని, వైద్య ఖర్చులు కూడా పేదవారు సైతం చికిత్స చేపించుకునేల ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ,నాయకులు,పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# జీ 20 సదస్సు వేళ ఢిల్లీలో వర్షాలు

- అప్రమత్తమైన అధికారులు

టి మీడియా, సెప్టెంబర్ 9,ఢిల్లీ :



జీ20 సదస్సుకు ముందు శనివారం ఢిల్లీలో వర్షం కారణంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వర్షం కారణంగా ఢిల్లీలో కాలుష్యం తగ్గింది. రానున్న రెండు,మూడు రోజుల్లో బలమైన గాలులు, తేలికపాటి వర్షాలు కురవవచ్చునని వాతావరణశాఖ అధికారులు చెప్పారు. శనివారం మెగా జీ20 సమ్మిట్‌కు ఢిల్లీ సన్నద్ధమవుతున్న తరుణంలో కురుస్తున్న వర్షం ఢిల్లీ నగరాన్ని చల్లబర్చిందిదేశ రాజధాని నగరమైన ఢిల్లీలో నేడు, రేపు మధ్యాహ్నానికి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఢిల్లీలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. శనివారం తెల్లవారుజామున ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో అకస్మాత్తుగా వర్షం కురిసింది. నైరుతి ఢిల్లీలోని వసంత్ కుంజ్, మునిర్కా, నరేలా ప్రాంతాలతో సహా ఢిల్లీలో శనివారం తెల్లవారుజామున తేలికపాటి వర్షం కురిసింది.తెల్లవారుజామున కురిసిన వర్షం ఢిల్లీని అతలాకుతలం చేసింది. ఢిల్లీలోని చాలా ప్రాంతాలు నీట మునిగాయి. వర్షాల నేపథ్యంలో ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

# పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్ట్

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

టి మీడియా, సెప్టెంబర్ 9,తిరుపతి:



అన్ని ఆధారాలతోనే చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేసిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు అరెస్ట్ పై స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి.. రాష్ట్రంలో జరిగిన పరిణామాలు ప్రజల దఅష్టిలో ఉన్నాయి.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం లో చంద్రబాబు అరెస్ట్ అయ్యారు. రోడ్డు మార్గం ద్వారా విజయవాడ తరలిస్తున్నారు.. సీఐడీ అడిషనల్ డీజీ సంజరు కేసుకు సంబంధించి పూర్తి సమాచారాన్ని అందించారని గుర్తుచేశారు. కొన్ని మీడియా సంస్థలు చంద్రబాబు అరెస్ట్ తప్పు అంటూ వాదనలు చేస్తున్నారని మండిపడ్డారు. 90 శాతం సిమెన్స్, 10 శాతం ప్రభుత్వం ఖర్చు చేయాలి.. రూ.3,356 కోట్ల ప్రాజక్ట్ లో రూ.371 కోట్లు ప్రభుత్వం ఇవ్వాలి.. ఏ కారణం లేకుండా ఒక కంపెనీ ప్రభుత్వం తరపున రూ.3000 కోట్లు ఎందుకు ఖర్చు చేస్తుందని ప్రశ్నించారు.. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు, ఈడీ అరెస్టులు చేశాయి అని తెలిపారు.సీమెన్స్, డిజిటెక్, స్కిల్లర్ కంపెనీల ప్రతినిధులను ఇప్పటికే ఈ కేసులో అరెస్ట్ చేశారు.. వారంతా ఈ కుట్రలో పాత్రధారులు. సిమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. కేవలం ప్రభుత్వం 10 శాతం కింద ఇచ్చిన 371 కోట్ల రూపాయలను మింగేశారని ఆరోపించిన ఆయన.. షెల్ కంపెనీల ద్వారా డబ్బులు బదలాయించారు.. ఆ డబ్బులు అన్ని చంద్రబాబుకు, ఆ పార్టీ వారికే చేరాయన్నారు. ఇది చంద్రబాబు నాయుడు స్వయంగా చేసిన స్కాం కాబట్టే.. అయన ఈ విషయంపై ఏమి మాట్లాడలేదని దుయ్యబట్టారు. అయన పార్టీ వారిని పెట్టుకుని అడ్డగోలుగా వాదిస్తుంటే.. చంద్రబాబు.. సీఐడీని నిలదీశారని ప్రచారం చేసుకుంటున్నారు.. ఐటీ నోటీసులు ఇస్తే.. ఆ సర్కిల్ నోటీసు ఇవ్వకూడదని అడ్డగోలు వాదనలు చేశారి ఆగ్రహం వ్యక్తం చేశారు.చంద్రబాబు బంధువు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, దత్త పుత్రుడు పవన్ కల్యాణ్, సీపీఐ నారాయణ, రామకఅష్ణ ఎవ్వరూ ఈ విషయంలో నోరు మెదపడం లేదు ఎందుకని నిలదీశారు. పురంధేశ్వరి ఈ రూ.371 కోట్లు చంద్రబాబు తిన్నారా లేదా అని చెప్పాలని డిమాండ్ చేశారు.





# క్రీసెంట్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో గ్రీన్ డే సెలబ్రేషన్స్

- సీఈఓ తహబిలాల్

టీ మీడియా ,సెప్టెంబర్ 9, పెద్దపల్లి బ్యూరో :

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఇప్పలపల్లి గ్రామ పరిధిలోగల క్రిసెంట్ఉన్నత పాఠశాలలో"గ్రీన్ డే"కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్రీసెంట్ ఉన్నత పాఠశాలల కరస్పాండెంట్ శ్రీ సయ్యద్ వజహతుల్ల ఆయాజ్ సభాధ్యక్షులుగా నిర్వహించగా ఇప్పలపల్లి సర్పంచ్ సంగీతా మహేందర్ పెగడపల్లి సర్పంచ్ అరెల్లి సుజాత రమేష్ డాక్టర్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లను పెంచాలని పర్యావరణాన్ని రక్షించాలని చెట్లను నరకవద్దని వారు సూచించారు. పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటికొక చెట్టు నాటాలని ఒక చెట్టు నరుకుతే ఐదు చెట్లను పెంచాలని వారు కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ నసీర్ మాట్లాడుతూ చెట్లను పెంచడంతోపాటు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు ప్లాస్టిక్ వాడడం నిషేధించాలని కోరారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు మొక్కల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బైరి రాజా వీరు జాఫర్ ఆలీ నాజిమ్ పద్మజ మౌనిక మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాత్రికి రాత్రే చంద్రబాబును అరెస్టు అన్యాయం

- నారా భువనేశ్వరి

టి మీడియా, సెప్టెంబర్ 9,విజయవాడ:



టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుపై ఆయన సతీమణి నారా భువనేశ్వరి స్పందించారు. విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. "నా భర్తను రక్షించాలని, ఆయనకు మనోధైర్యం ఇవ్వాలని దుర్గమ్మను కోరా. చంద్రబాబు రాష్ట్ర ప్రజల బాగు కోసం పోరాటం చేస్తున్నారు. ఒక బిడ్డకు మనసు బాగాలేనప్పుడు తల్లిదండ్రుల వద్దకు వెళ్తారు. అందుకే నా బాధ చెప్పుకోవడానికే అమ్మవారి దగ్గరకు వచ్చా. చంద్రబాబు పోరాటం ప్రజల స్వేచ్ఛ కోసం. చేయి చేయి కలిపి ప్రజలంతా ఏకమవ్వాలి" అని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు.ఆమెతో పాటు కనకదుర్గమ్మను దర్శించుకున్న నందమూరి రామకఅష్ణ మాట్లాడుతూ.. "అందరి ఆశీస్సులు మా కుటుంబానికి కావాలి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. రాత్రికి రాత్రే చంద్రబాబును అరెస్టు చేయడం అన్యాయం. చంద్రబాబు తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం శ్రమిస్తున్నారు. ఏపీని వదిలేసి ముఖ్యమంత్రి విదేశాల్లో తిరుగుతున్నాడు. అది మన దౌర్భాగ్యం. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలుపుదాం" అని అన్నారు.

# ప్రతిపక్ష నాయకుడిని ఆహ్వానించకపోవడం బాధాకరం

- కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం

టి మీడియా, సెప్టెంబర్ 9,ఢిల్లీ:



దేశ రాజధాని ఢిల్లీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జీ-20 సదస్సును పురస్కరించుకుని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన విందుకు కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆహ్వానించకపోవడంపై పార్టీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆయన ట్విటర్ వేదికగా మోడీ సర్కారు తీరును విమర్శించారు.విందుకు ప్రతిపక్ష నేతను ఆహ్వానించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. "ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జీ-20 సదస్సులో ఏర్పాటు చేసిన విందుకు గుర్తింపు ఉన్న ప్రతిపక్ష నాయకుడిని ఆహ్వానించకపోవడం బాధాకరం. ప్రజాస్వామ్య దేశాల్లో ఎక్కడా కూడా ఇలా జరిగి ఉండకపోవచ్చు. ఇలాంటి చర్య ప్రజాస్వామ్యం లేని దేశాల్లో మాత్రమే జరుగుతుంది. ఇంకా మన దేశంలో ప్రతిపక్షం ఉనికిని కోల్పోయే దశకు చేరుకోలేదనే నేను భావిస్తున్నాను" అని ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా.. యూరప్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జీ20 సదస్సుకు పక్ష నేతను పిలవకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌లోని 60 శాతం మందికి ప్రతినిధిగా ఉన్న నేతకు ప్రస్తుత నాయకత్వం విలువ ఇవ్వడం లేదని అర్థమవుతోంది. వాళ్లు ఎందుకలా భావిస్తున్నారు అని ప్రశ్నించారు.

# అమెరికా వెళ్లబోతున్న జీహెచ్ఎంసీ వర్కర్

- చెత్త అమ్మాయి అన్నవాళ్లే ఉత్తమ అమ్మాయి అనేలా

టి మీడియా, సెప్టెంబర్ 9,హైదరాబాద్:



తిని పడేసిన చెత్తను.. తీసి పక్కనే ఉన్న డస్ట్ బిన్‌లో పడేయడానికి చాలా మంది బద్ధకాన్ని ప్రదర్శిస్తుంటారు.. ఒక్క రోజు చెత్త మన ఇంట్లోనే అలా ఉండిపోతే ముక్కు మూసుకొని ఇంటి ముందు ఎదురు చూసుకుంటూ ఉంటాం. ఆ వ్యర్థాల కోసం మున్సిపల్ వర్కర్లు ఎవరైనా వచ్చినా చెత్త వేసుకొని పోయేవాళ్లే వచ్చారని అనుకుంటాం.. ఇక రెండు రోజులు బంద్ పెట్టారా ఇక ధ్యాసంతా వాళ్ళ పైనే ఉంటుంది. అలా జీహెచ్ఎంసీ పరిధిలోని ఇంటి ఇంటికి తిరుగుతూ.. చెత్తను ఎరుతూ.. తన తల్లికి తోడుగా ఉంటుంది జయలక్ష్మి అనే ఓ యువతి.. చేసే పని ఎంత ఇబ్బందిగా ఉన్న కడుపుకి అన్నం పెడుతూ ఉండటంతో ఈ పనే తనకు చాలా ఇష్టం అంటుంది.. చిన్నతనం నుండి తన తల్లితో పాటు చెత్త వేసేందుకు వెళ్లిన జయలక్ష్మి.. చెత్తను ఎరుతూనే ఎంతో ఎత్తుకు ఎదుగుతుంది.. మరి చిత్తశుద్ధి తో చెత్త పని చేసుకుంటూ ముందుకు దూసుకెళ్తోంది.తాజాగా యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వారి గాంధీ కింగ్ ఎక్స్చేంజ్ ఇనిషియేటివ్ ఆధ్వర్యంలో స్కాలర్షిప్‌ను పొందింది. 2 వారాల పాటు మార్టిన్ లూథర్ కింగ్ మార్గంలో అహింసా పద్ధతిలో ప్రజా ఉద్యమాలు ఎలా నిర్వహించాలో అధ్యయనం చేసి రావడానికి దరఖాస్తులు కోరినప్పుడు దేశవ్యాప్తంగా వేల అప్లికేషన్లు వచ్చాయి. ఇక వారిలో పది మందిని మాత్రమే ఎంపిక చేశారు, పదిమంది లో తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు ఉండడం విశేషం. అందులో జయలక్ష్మికి కూడా అవకాశం దక్కింది.. రాయలసీమ ప్రాంతానికి చెందిన జయలక్ష్మి కుటుంబం ఉపాధి కోసం హైదరాబాదులోని ముసరాంబాగ్‌కు వలస వచ్చింది. అక్కడ పిండిని అమ్ముకుంటూ జీవనాన్ని కొనసాగిస్తోంది. అయితే తల్లిదండ్రులు చెత్త బండి నడపడాన్ని ఉపాధిగా చేసుకున్న తర్వాత అదే వాళ్ళ జీవనాధారంగా మారింది.. చేసే పని అత్యంత దయనీయమైనది అయినప్పటికీ అందరూ ఏమనుకున్నా సరే ఈ పని చేసేందుకు చిన్నప్పటి నుంచి అమ్మతోపాటు తోడుగా వెళ్లే దాన్ని అని, తనకు అన్నయ్య చెల్లెలు ఉన్నారని మంచి ఉద్యోగాలలో స్థిరపడాలంటే ఈ పని చేయక తప్పదు అంటూ అమ్మ చెప్తూ ఉండేదని జయలక్ష్మి చెబుతోంది.అయితే చిన్నప్పటి నుంచి జయలక్ష్మి బడిలో సహా ఏ సమస్యపై అయినా మాట్లాడేందుకు చురుగ్గా ఉండేది.. పేద వర్గాల కోసం పనిచేసే ఓ ఎం సి ఓ సంస్థ జయలక్ష్మిని గుర్తించి ఆమెను ప్రోత్సహించారు. ఇంగ్లీష్ మీడియం చదవాలనుకునే పిల్లల కోసం తానే నాలుగు కిలో మీటర్ల వరకు నడుచుకుంటూ వెళ్లి కరోనా సమయంలో ఎంతో మంది చిన్న పిల్లలకు ట్యూషన్ చెప్తూ పాఠం నేర్పించానని జయలక్ష్మి పేర్కొంది. అయితే తనకు ఐఏఎస్ కావాలన్నది కోరిక అని, యువత తమ హక్కుల కోసం పోరాడాలి వారికి నాయకత్వ లక్షణాలు సైతం ఉండాలి ఈ సమయంలో తనకు వచ్చినటువంటి యునైటెడ్ స్టేట్స్ ఆఫర్ ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని, అమెరికా వెళ్లి యువత పోరాటాల విజయకాంతలను అధ్యయనం చేయడం అదష్టంగా భావిస్తున్నానని జయలక్ష్మి అంటుంది. ఇలా చెత్త అమ్మాయి అని పిలిచే కొందరికి ఉత్తమ అమ్మాయిగా పిలిపించుకుంటున్నానని, ఇది తనకు సంతోషాన్నిస్తోందని జయలక్ష్మి అంటోంది.



# అంతర్జాతీయ సెక్స్ రాకెట్ గుట్టు రట్టు

- ఇద్దరు విదేశీ మహిళల అరెస్ట్

టి మీడియా, సెప్టెంబర్ 9,గోవా :

అంతర్జాతీయ సెక్స్ రాకెట్ గుట్టు రట్టు అయింది. అంతర్జాతీయ సెక్స్ రాకెట్‌లో ప్రమేయం ఉన్నారనే ఆరోపణలపై ఇజ్రాయెల్, కెన్యా దేశాలకు చెందిన ఇద్దరు మహిళలను శుక్రవారం అరెస్టు చేసినట్లు గోవా పోలీసు అధికారులు తెలిపారు. అంజునా పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన మరియా డోర్కాస్, కెన్యాకు చెందిన విల్కిస్టా అచిస్టా పట్టుబడ్డారని డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జీవ్బా దాల్వి తెలిపారు. భారతదేశంలో హాస్పిటాలిటీ రంగంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కెన్యా నుంచి మహిళలను రప్పించి వారితో వ్యభిచారం చేయించారని సమాచారం.పోలీసుల దాడుల్లో చిక్కిన ఐదుగురు కెన్యా మహిళలను విడిచిపెట్టారు. కెన్యా దేశం నుంచి మహిళలు భారతదేశానికి వచ్చాక వారి పాస్ పోర్టులు, వీసాలను ఏజెంట్లు తీసుకొని, వారిని బెదిరించి వ్యభిచారంలోకి నెట్టారని పోలీసులు చెప్పారు. విదేశీ మహిళలతో ఎస్కార్ట్ సర్వీస్ వెబ్ సైట్ ను ఉపయోగించి ఆన్‌లైన్‌లో సెక్స్ రాకెట్ నడిపారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.బెంగళూరుకు తీసుకెళ్లిన కొంతమంది బాధిత యువతుల గురించి ఎన్జీవో ఏఆర్‌జెడ్ గుర్తించిన తర్వాత ఈ రాకెట్ వెలుగులోకి వచ్చింది. గోవా పోలీసులు వెంటనే దాడులు చేసి అంతర్జాతీయ సెక్స్ రాకెట్ గుట్టును ఛేదించారు. రక్షించిన మహిళలను మెర్సెస్‌లోని రక్షిత గృహంలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.



# చంద్రబాబుఅరెస్టు పై... భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు

టి మీడియా, సెప్టెంబర్ 9, హుజూర్ నగర్:

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై తెలుగు తమ్ముళ్లు భగ్గుమన్నారు. చంద్రబాబు నాయుడు ను అర్ధరాత్రి అక్రమ అరెస్టు చేయడంపై హుజూర్నగర్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అడ్డరోడ్డు సెంటర్లో ధర్నా, పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుకి ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నల్గొండ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి హుజూర్నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ మండవ వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ..జగన్మోహన్ రెడ్డి కళ్ళలో ఆనందం కోసమే ఏపీ సిఐడి పోలీసులు చంద్రబాబు నాయుడుని అరెస్టు చేశారని విమర్శించారు. ఆర్థిక నేరాలలో చిక్కుకొని 16 నెలలు చిప్పకూడుతున్న జగన్మోహన్ రెడ్డి చంద్రబాబును జైలు పాలు చేయాలనే నేపంతో కుట్రలకు తెర లేపారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలలో విశ్వాసం కోల్పోయిన జగన్మోహన్ రెడ్డి బెదిరింపులు, దౌర్జన్యం ,అక్రమ అరెస్టులతో పాలన కొనసాగిస్తున్న విషయం యావత్ ప్రజానీకం గమనిస్తుందన్నారు. అంతకుముందు జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ,అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో లిహుజూర్నగర్ పట్టణ పార్టీ అధ్యక్షులు కొమ్మగాని వెంకటేశ్వర్లు గౌడ్, గరిడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు కీసరి నాగయ్య ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# లబలవన్మరణం వద్దు..బతికి సాధిద్దాం

- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

టీ మీడియా, సెప్టెంబర్ 09, రామకృష్ణాపూర్:



నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఓ కష్టం,ఓ నష్టం,ఆవేదన,ఆక్రోశం, ఏదోఒక ఆందోళన,ఏదో ఒక కారణం,మనిషిని తన ఉసురు తీసుకునేలా చేస్తోంది.సెలబ్రిటీల నుంచి సాధారణ గృహిణిల వరకు, రైతుల నుంచి విద్యార్థుల వరకు బలవన్మరణాలకు పాల్పడుతూ తమ కుటుంబాలకు తీరని ఆవేదన మిగిలిస్తున్నారు.జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకోలేక, చిన్న చిన్న సమస్యలకే భయపడి ఆత్మహత్యలకు పాల్పడేవారు ప్రస్తుతం పరిస్థితులలోఎక్కువవుతున్నారు.కుటుంబ సమస్యలతో,అనారోగ్యంతో,మాదక ద్రవ్యాలు,మద్యంతో,దివాలా, రుణ భారంతో, నిరుద్యోగంతో, వృత్తి సమస్యలతో, పేదరికంతో, ఇష్టమైన వారి మరణంతో, మొదలైన సమస్యలతో గాబర పడిపోయి ఆత్మహత్యే పరిష్కారమని భావించి క్షణికావేశంలో ప్రాణం తీసుకుంటున్నారు. సృష్టిలో ఉన్న ప్రతి ప్రాణికి కష్టాలు తప్పవు.చిన్న చీమ నుండి చిరుత పులి వరకు నిత్యం పోరాడుతూనే జీవిస్తూ ఉంటాయి తప్ప ఆత్మహత్యలకు పాల్పడవు. మానసికంగా కృంగిపోకుండా, బతికి సాధించాలి. ఆత్మహత్యల నివారణకు సమాజమే పరిష్కార మార్గాలని చూపాలి.తద్వారా ఆత్మహత్యలను నివారించగలం అని,ప్రతి ఒక్కరూ ధైర్యంతో , ఆత్మస్థైర్యం తో జీవితం లో ముందుకు నడవాలని రాజలింగు మోతె అడ్వకేట్, సమాఖ్య కుటుంబ సలహా, మధ్యవర్తిత్వం కేంద్రం సూచించారు.

# స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్

- చంద్రబాబే ప్రధాన నిందుతుడు : ఏపీ సీఐడీ

టి మీడియా, సెప్టెంబర్ 9,విజయవాడ :



టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌పై ఏపీ సీఐడీ డీజీ సంజయ్ స్పందించారు. చంద్రబాబు అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న చంద్రబాబును ఈరోజు ఉదయం 6 గంటలకు నంద్యాలలో ఆర్కే ఫంక్షన్ హాల్ నుంచి సీఐడీ బందం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ. 550 కోట్ల స్కామ్ జరిగిందని చెప్పారు. ప్రభుత్వానికి రూ.371 కోట్ల నష్టం వచ్చిందని తెలిపారు. నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా షెల్ కంపెనీలకు నిధులు మళ్లించారని తెలిపారు. చంద్రబాబుకు అన్ని లావాదేవీల గురించి తెలుసునని అన్నారు. ఈ కేసుకు సంబంధించి కీలక పత్రాలను మాయం చేశారని.. ఈ స్కామ్‌లో బెనిఫిషియరీ కూడా చంద్రబాబేనని అన్నారు. ఈ కేసు దర్యాప్తులో చంద్రబాబు నాయుడే ప్రధాన నిందుతుడని తేలిందని చెప్పారు. చంద్రబాబును కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఈడీ, జీఎస్టీలు కూడా ఇప్పటికే ఈ కేసును విచారించాయని తెలిపారు. ఈ కేసులో నారా లోకేశ్ ను కూడా ప్రశ్నించాల్సి ఉందని చెప్పారు. నిధులు కాజేసేందుకే స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. కేబినెట్ ఆమోదం లేకుండానే కార్పొరేషన్ ను ఏర్పాటు చేశారని చెప్పారు. గంటా సుబ్బారావును కార్పొరేషన్ ఎండీ, సీఈవోగా నియమించారని తెలిపారు. ఆయనకు నాలుగు పదవులు కట్టబెట్టారని అన్నారు. ఈడీ, జీఎస్టీ సంస్థలు కూడా దీనిపై విచారణ జరిపాయని చెప్పారు. నకిలీ ఇన్ వాయిస్ ల ఆధారంగా నగదు బదిలీ చేశారని తెలిపారు. న్యాయ పరంగా అన్ని చర్యలు తీసుకునే చంద్రబాబును అరెస్ట్ చేశామని తెలిపారు. అన్ని వివరాలు బయటకు రావాలంటే చంద్రబాబును అరెస్ట్ చేయడం తప్పదని అన్నారు. ఈ కేసులోని ఇతర నిందితులు దుబాయ్, యూఎస్ లలో ఉన్నారని... వారిని అక్కడి నుంచి తీసుకురావడానికి ఆయా దేశాలకు అధికారులు వెళ్తారని చెప్పారు.

# గిరిజన హక్కుల సాధనే లక్ష్యం

- రవీందర్ నాయక్

టి మీడియా,సెప్టెంబర్ 9, మేళ్ళ చెరువు:



గిరిజన హక్కుల సాధనే లక్ష్యంగా సేవాలాల్ సేన పనిచేస్తుందని సేవాలాల్ సేన సేన సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ధరావత్ రవీందర్ నాయక్ అన్నారు.శనివారం మండల ప్రధాన రహదారి అంబేద్కర్ విగ్రహం వద్ద సేవాలాల్ సేన 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ సేన ఆధ్వర్యంలో గిరిజనులకు10శాతం రిజర్వేషన్ సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.500 జనాభా కలిగిన ప్రతి తండాను ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయితీలుగా చేయడంలో సేవాలాల్ సేన ప్రత్యేక భూమిక పోషించిందని ఆయన తెలిపారు.పోడు భూములకు పట్టాలు ఇవ్వడం కూడా సేవాలాల్ సేన ఘనతే అని ఆయన అన్నారు.తండా గ్రామపంచాయితిని ప్రత్యేక రెవెన్యూ గ్రామపంచాతీలుగా గుర్తించాలని కోరారు. గిరిజన యూనివర్సిటీ ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా కార్యదర్శి, మండల అధ్యక్షుడు బానోతు హుస్సేన్ నాయక్, సేవాలాల్ రైతు సేన జిల్లా నాయకులు భూక్యా బాలు నాయక్, నాయకులు రాజు నాయక్, రమేష్ నాయక్, నాగు నాయక్, సాయి నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# శాంతిభద్రతలు క్షీణించాయి : పవన్

టి మీడియా, సెప్టెంబర్ 9,అమరావతి :

టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేయడంపై జనసేనాని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ప్రాథమిక ఆధారాలను కూడా చూపించకుండానే అర్ధరాత్రి వేళల్లో అరెస్ట్ చేసే విధానాన్ని ఏపీలో అవలంభిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది విశాఖపట్నంలో జనసేనపై పోలీసు వ్యవస్థ ఏ విధంగా వ్యవహరించిందో అందరూ చూశారని చెప్పారు. ఏ తప్పు చేయని జనసేన నాయకులపై హత్యా యత్నం కేసులు నమోదు చేసి, అన్యాయంగా జైళ్లలో పెట్టారని దుయ్యబట్టారు. ఇప్పుడు నంద్యాలలో చంద్రబాబును అరెస్ట్ చేసిన సంఘటన కూడా అలాంటిదేనని విమర్శించారు. చంద్రబాబు అరెస్ట్‌ను జనసేన సంపూర్ణంగా ఖండిస్తోందని పవన్ చెప్పారు.

# చంద్రబాబు అరెస్టుకు నిరసనగా.. టిడిపి నాయకుల నిరసన ర్యాలీ

టి మీడియా, సెప్టెంబర్ 9,రాజంపేట :



టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ టిడిపి నాయకులు శనివారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బైపాస్ రోడ్డులో గల ఎన్టీఆర్ విగ్రహం వరకు నల్లజెండాలతో ర్యాలీగా వెళ్లి జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జాతీయ రహదారిపై ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. టిడిపి నాయకులు, కార్యకర్తలను బలవంతంగా ఆటోలలోనూ, మినీ వ్యాన్లలోనూ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, మహిళా నాయకురాలు అనసూయమ్మ, మిరియాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# గూడ్స్ రైలు ఢీ కొని వ్యక్తి దుర్మరణం

టి మీడియా,సెప్టెంబర్ 9, మేళ్ళ చెరువు:



మండలం రామాపురం గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం రైల్వే ట్రాక్ పై రైలు ఢీకొని ప్రమాదవ శాత్తు రామాపురం నివాసి చాట్ల తిరు పతి వెంకయ్య దుర్మరణం చెందారు. అట్టి విషయం తెలుసుకున్న ప్రముఖ కాంగ్రెస్ నాయకులు సైదేశ్వరావు ప్రమాద స్థలానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.